క్లుప్తంగా

నేడు ప్రజావాణి

బంట్వారం: రెవెన్యూ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించే ప్రజావాణిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అఫ్జల్ రసూల్ ఆదివారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ధరణికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దుష్ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కొడంగల్ రూరల్: వాట్సాప్ ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటంతో దుష్ప్రచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాములు తెలిపారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొడంగల్ మండలం రావులపల్లికి చెందిన అశోక్.. సీఎం ఫొటోకు తప్పుడు సమాచారం యాడ్‌చేసి, తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకున్నాడని, అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి స్టేటస్‌ను చూసి ఫిర్యాదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సదరు వ్యక్తి ఫిర్యాదు మేరకు అశోక్ ఫోన్‌ను పరిశీలించి, కేసు నమోదు చేశామని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిరుపేదల కష్టాలు పట్టవా?



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: వర్షాలకు ఇళ్లు కూలి, రోడ్డున పడుతున్న నిరుపేదల కష్టాలు పాలకులకు పట్టవా అని కాంగ్రెస్ పార్టీ కుల్కచర్ల మండలం అధ్యక్షుడు ఆంజనేయులు ప్రశ్నించారు. ముసురు వానలతో ముజాహిద్‌పూర్‌లో పలు ఇళ్లు కూలిపోయాయి. ఈ సందర్భంగా ఆయన ఆదివారం బాధితులను పరామర్శించి మాట్లాడారు. అకాల వర్షాలతో నిరుపేదలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, ప్రభుత్వం స్పందించి ఇళ్లు కూలిపోయిన వారికి ఆర్థిక సహాయం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆనంద్, షర్ఫొద్దీన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన పినమోని సందమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్ ముదిరాజ్, స్థానిక జిల్లా నాయకుడు బాలముకుందం ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో రామయ్య, ఎల్లయ్య, లక్ష్మయ్య, నర్సింహులు, లక్ష్మయ్య, లింగయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శిబిరం అభినందనీయం



కంటి పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్ అలివేలమ్మ

మోమిన్‌పేట: గ్రామంలో ఉచిత వైద్య కంటి శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం మోమిన్‌పేట మండలం ఏన్కతలలో శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నేత్ర శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంటి జబ్బు ఉన్నవారు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రభాకర్, ప్రదీప్, శ్రీరాం, సర్పంచ్ అలివేలమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం: సర్పంచ్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని సర్పంచ్ అలివేలమ్మ అన్నారు. ఆదివారం ఏన్కతల గ్రామానికి చెందిన బోయ వెంకటేశంకు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.60వేల చెక్కును అందజేసి మాట్లాడారు. పేదలు కార్పొరేటు ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవడానికి ఈ నిధి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

చేవెళ్ల: గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆలూరు సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీలు యాదమ్మ, నరేందర్‌చారిలు అన్నారు. చేవెళ్ల మండలం ఆలూరులో ఆదివారం మండల పరిషత్ నిధులతో సీసీరోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ వచ్చిన తరువాతనే గ్రామాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. ఆలూరు మండలంలోనే పెద్ద గ్రామం కావటంతో ఇక్కడ అధిక నిధుల అవసరం ఉంటుందని చెప్పారు. మండల పరిషత్, జిల్లాపరిషత్ నిధులతో పాటు ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎంపీ రంజిత్‌రెడ్డిల సహకారంతో ప్రత్యేకంగా నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

వ్యాధుల కాలం.. జరపైలం

- ముసురు వానలతో పొంచిఉన్న ముప్పు
- నిలువనీటితో పెరుగుతున్న దోమలు, ఈగలు
- ఆందోళన కలిగిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమ్మె
- అపరిశుభ్రతతో కంపుకొడుతున్న పల్లెలు

ఏకధాటి వర్షాలు ఓ వైపు ఆనందాన్ని ఇస్తున్నా.. మరోవైపు ఆందోళన కలిగిస్తోంది. అసలే వ్యాధుల కాలం. ఆపై కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్మికుల సమ్మె కారణంగా పల్లెలు అపరిశుభ్రతతో కంపుకొడుతున్నాయి. నిర్విరామంగా వారం రోజులుగా కురుస్తున్న ముసురుతో ఖాళీ ప్రదేశాల్లో వర్షపు నీరు నిలుస్తోంది. ఫలితంగా తాగునీరు కలుషితం కావడం, ఆపై లోపించిన పారిశుద్ధ్యంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది, విష జ్వరాలు సోకే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పరిగి/నవాబుపేట/దౌల్తాబాద్: వరుస వర్షాలతో పల్లెలు, పట్టణాలు చిత్తడిగా మారాయి. వాన నీరు నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి కార్మికులు సమ్మె తోడుకావడంతో పారిశుద్ధ్యం లోపించి పల్లెల్లో చెత్త పేరుకుపోతోంది. అపరి శుభ్రత వాతావరణంలో మలేరియా, చికున్‌గున్యా, మెదడు వాపు రోగాలు చుట్టుముట్టనున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తాజాగా జిల్లా వైద్యాధికారి సూచనలతో గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశలు డ్రై డేను నిర్వహిస్తూ.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కొబ్బరి చిప్పలు, బొండాలు, కోడిగుడ్డు పెంకులు, మొక్కల తొట్టీలు, వృథాగా ఉన్న టైర్లు, వాడిన కూలర్లలో నీరు ఉంటే డెంగీ, మురుగు నీరు నిల్వతో మలేరియా, ఫైలేరియా వచ్చే అవకాశం ఉందని, పరసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు.

టైఫాయిడ్ లక్షణాలు

కలుషిత నీటిని తాగడం, బహిరంగ మలవిసర్జన వలన టైఫాయిడ్ వ్యాప్తి చెందుతుంది. జ్వరం త్వరగా తగ్గకపోవడం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కడుపులో అల్సర్‌గా ఉంటే టైఫాయిడ్ లక్షణాలుగా గుర్తించాలి. సురక్షిత నీటిని తాగడం, జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకొని, తగిన చికిత్స తీసుకోవడంతో నయం కావొచ్చు.





దౌల్తాబాద్: ఇళ్ల మధ్యలో మురుగునీరు (ఇన్‌సెట్‌లో) పరిగి: వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మలేరియా..

ఎనాఫిలస్ అనే దోమ కుట్టడం ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుంది. వైవాక్స్ మలేరియా, ఫాల్స్ ఫారమ్ మలేరియా అనే రెండు రకాలు ఉన్నాయి. ఇందులో రెండో రకం అత్యంత ప్రమాదకరమైంది. జ్వరం వచ్చినప్పుడు సకాలంలో చికిత్స తీసుకోకుంటే చాలా ప్రమాదం. తీవ్రమైన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం, తీవ్రమైన తల నొప్పి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

డయేరియా

కలుషిత నీరు తాగడం, ఆహారం తీసుకోవడం వలన డయేరియా సోకుతుంది. ఒకరి నుంచి మరొకరికి త్వరగా వ్యాప్తి చెందుతుంది. వరుస విరేచనాలు, వాంతులు కావడం ఈ వ్యాధి లక్షణాలు. వ్యాధి నివారణకు వైద్యులు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తారు. సురక్షిత, కాచి చల్లార్చిన నీటిని తాగాలి. పులుపు కారం ఉండే ఆహారాన్ని తగ్గించడం, ఫాస్ట్‌ఫుడ్ వంటివి తినకపోవడం మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఇంటి పరిసరాల్లో నీటి నిలువ లేకుండా చూసుకోవాలి. ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటిసంపులు, పాత్రలపై నిరంతరం మూతలు పెట్టాలి. వారానికి ఒకసారి నీటి నిల్వ పాత్రలు డ్రమ్ములను ఖాళీ చేసి శుభ్రం చేయాలి. కాలువలో వ్యర్థాలు, చెత్త వేయరాదు. వీటి వలన నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతాయి. దోమలు రాకుండా ఇంటి ద్వారాలు, కిటికీలకు సన్నని జాలిని బిగించుకోవాలి. దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలి.

అవగాహన కల్పిస్తున్నాం



వారంలో ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నాం. వర్షాల కారణంగా ఉన్నతాధికారుల సూచనాల మేరకు బుధవారం వరకు గ్రామాల్లో కార్యక్రమం చేపడుతున్నాం. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తీసుకునే ఆహారం విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నాం. కాచి చల్లార్చిన నీటిని తాగాలని చెబుతున్నాం.

– హేమ, పల్లె దవాఖాన వైద్యాధికారి, నస్కల్

పరిశుభ్రతతోనే పరిరక్షణ



వర్షాకాలంలో పరిశుభ్రతతోనే పరిరక్షణ. నివాసాలు, పరిసరాల ప్రాంతాలను పరశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు వ్యాపించవు. తిను బండరాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. వేడి పదార్థాలనే తినాలి. ఏ మాత్రం అస్వస్థతకు గురైనా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

– డా. రోహిత్, వైద్యాధికారి, నవాబుపేట

జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవు. ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగితే వ్యాధులను నిరోధించడానికి అవకాశం ఉంటుంది.

– రతన్‌లాల్, వైద్యాధికారి, దౌల్తాబాద్

అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌ఐ రవిగౌడ్



జేసీబీ సహాయంతో వాగులో చెత్తను తొలగింపజేస్తున్న ఎస్‌ఐ

దోమ: ప్రస్తుత వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రవిగౌడ్ సూచించారు. ఆదివారం దోమ మండలం గంజిపల్లి వాగులో చెత్త, చెదారాన్ని జేసీబీ సహాయంతో తొలగింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాలతో చెరువులు, కుంటలు నిండి వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వైపు ఎవరూ వెళ్లకూడదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగారాన్ని మండలంగా ఏర్పాటు చేయాలి

ధారూరు: ధారూరు మండలం నాగారం గ్రామాన్ని మండలముగా ప్రకటించాలని ఏఐటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం మాట్లాడారు. నాగారం మండల సాధన కోసం అధికార, ప్రతిపక్షాలు, నాయకులు కృషి చేయాలని కోరారు. యేటా కాగ్నా నది ఉధృతంగా ప్రవహించి, రాకపోకలు నిలిచిపోతున్నాయని వాపోయారు. నది ప్రవహిస్తున్నప్పుడు మండల కేంద్రం ధారూరుకు వెళ్లాలంటే 30 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని పేర్కొన్నారు. పోరాటం ఉధృతం చేసి, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- శిథిల గృహాలను ఖాళీ చేయాలని ఎమ్మెల్యే పట్నం సూచన
- రోడ్ల మరమ్మతు, విద్యుత్ పునరుద్ధరణకు ఆదేశాలు

కొడంగల్ రూరల్: ఎడతెరిపి లేని వర్షాలకు దెబ్బ తిన్న రహదారులు, విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆయన మున్సిపల్ పరిధి పాతకొడంగల్, పాతకొడంగల్ తండాలో పర్యటించారు. వర్షాలకు కూలిన ఇళ్ల బాధితులు జీడి ప్రశాంత్, రాజశేఖర్, జీడి భీమన్న, పిట్ల లక్ష్మమ్మ, గొల్ల పెద్ద బుగ్గయ్య, పుణ్యమ్మలను ఎమ్మెల్యే పరామర్శించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలని, వరుస వర్షాలతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, రాజశేఖర్, చిన్న బుగ్గయ్య, కొనంగి చిన్న శంకరయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె



దౌల్తాబాద్: సమ్మెలో జీపీ కార్మికులు

దౌల్తాబాద్: పంచాయతీ కార్మికుల సమ్మె ఆదివారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. తమ న్యాయమైన కోరికలు తీర్చాలని, కనీస వేతనం చెల్లించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల మండల సంఘం అధ్యక్షుడు సాయిలు, కార్మికులు ఉన్నారు.



తాండూరు రూరల్: మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

మోకాళ్లపై నిరసన

తాండూరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులు వినూత్నంగా నిరసన చేపట్టారు. తాండూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మోకాలిపై నిల్చొని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, కనీస వేతనం అమలు చేయాలని, రూ.10 లక్షల బీమా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ, కార్మికులు ఉన్నారు.

సాహితీ శిఖరాలు దాశరథి, సినారె

- ప్రజలను చైతన్య పరిచిన కవులు
- కవిసమ్మేళనంలో వక్తలు
- ఘనంగా దాశరథి, సినారే జయంతి

కొడంగల్ రూరల్: సాహితీ శిఖరాలు దాశరథి, సినారెలు అని, తెలుగు సాహిత్యానికి, తెలుగు భాషాభివృద్ధికి వారు చేసిన సేవలు అమోఘమని పలువురు వక్తలు కొనియాడారు. అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కవులు దాశరథి కృష్ణమాచార్య, డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతిని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ సాహితీ యోధుడు, నవయుగ వైతాళికుడు, ముఖ్య వక్తలు, అతిథులు హాజరయ్యారు. వక్తలు డాక్టర్ చెన్నకేశవరెడ్డి, పోలె విశ్వనాథం మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కలం ఝుళిపించి, గళం విప్పి తెలంగాణ ప్రజానికాన్ని తట్టిలేపిన నవయుగ వైతాళికుడు దాశరథి అని, తెలంగాణ నుంచి మొట్టమొదటగా జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్న జ్ఞాన యోధుడు సినారె అని కొనియాడారు. అనంతరం ప్రముఖ శతావధాని డాక్టర్ మలుగ అంజయ్య సమక్షంలో జరిగిన అష్టావదానంలో ప్రశ్నలకు అవధాని అంజయ్య సమాధానాలు చెప్పగా.. కరతాళ ధ్వనులతో వేదిక మారుమోగింది. కవి సమ్మేళనంలో కవులు, రచయితలు విద్యార్థులు తమ కవిత్వాలు వినిపిస్తూ రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజారాం, అనంత వ్యవస్థాపకుడు దొరవేటి చెన్నయ్య, గౌరవ అధ్యక్షుడు బీపీ నర్సింహులు గుప్తా, ప్రధాన కార్యదర్శి ఆశీర్వాదం, తూర్పు మల్లారెడ్డి, గంటా మనోహర్‌రెడ్డి, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, కవులు, రచయితలు వడిచర్ల సత్యం, మాసాని వెంకటయ్య, అంజిలప్ప, ఎరన్‌పల్లి శ్రీనివాస్, బత్తుల మల్లయ్య, పండరీ, శీలాదేవి, పద్మ, మంజుల, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.



అతిథులను సన్మానిస్తున్న సాహితీ సభ్యులు

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

- దెబ్బతిన్న కల్వర్టులు
- గుంతలమయంగా రహదారులు
- ప్రస్తుత వర్షాలకు మరింత దారుణం
- అసంపూర్తి వంతెనలు.. వెంటాడుతున్న రవాణా కష్టాలు



దోమ: బ్రాహ్మణపల్లి రైతువేదిక సమీపంలో కల్వర్టుపై ఏర్పడిన గుంత



పెద్దేముల్: గాజీపూర్ వంతెన పనులు నిలిచిపోవడంతో వాగు దాటేందుకు యత్నిస్తున్న ప్రజలు

దోమ/పెద్దేముల్: సాధారణంగా మారుమూల ప్రాంతాల రోడ్లంటేనే గుంతల మయంగా ఉంటాయని, గోతులు ఏర్పడి, రవాణాకు తీవ్ర అసౌకర్యంగా ఉంటాయనే భావన వాహనదారుల్లో ఉంటుంది. దానికి తోడు కురుస్తున్న వరుస వర్షాలతో ప్రాంతాలకు అతీతంగా రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. బీటీ కొట్టుకుపోయి కంకరతేలి దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. బండ్లు కిడ్ అయి కిందపడి గాయాల పాలవుతున్నారు. నీటితో నిండిన గుంతల్లో దిగబడి ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ వాహనాలు మరమ్మతులకు గురై రోడ్లపైనే కూలబడుతున్నాయి. దీంతో ట్రాఫిక్ కష్టాలు షరామామూలయ్యాయి. ప్రస్తుత వర్షాలకే రోడ్లు ఇలా అయితే.. మునుముందు ఇంకెలా ఉంటాయోనని ప్రజలు వాపోతున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో నిర్మించాల్సి చోట వంతెనలు నిర్మించకపోవడం, చేపట్టిన బ్రిడ్జిల పనులు మధ్యలో ఆగిపోవడం వలన పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముసురు వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో చాలా ప్రాంతాలకు బంధాలు తెగిపోవడం పరిపాటిగా మారిందని, అందుకు నిన్నమొన్నటి సంఘటనలే సాక్ష్యమని పలువురు చెబుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా..

దోమ మండలం బ్రాహ్మణపల్లి రైతు వేదిక సమీపంలో కల్వర్టు పై భాగంలో ఏర్పడ్డ భారీ గుంతతో ఆ దారి గుండా పయనించే దాదాపూర్, గుండాల, కొత్తపల్లి, మల్లేపల్లి, గంజిపల్లి, గొట్లచెల్కతండా, కొండాయపల్లి బడేంపల్లి వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు ఎవరి ప్రాణాలను హరిస్తుందోనని జంకుతున్నారు. విషయం సంబంధిత అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.

నిర్మాణ పనుల్లో జాప్యం

తాండూరు నుంచి రాజధాని హైదరాబాద్, లింగంపల్లి, సంగారెడ్డిలకు వెళ్లే రవాణా మార్గాలు అధ్వానంగా ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న వంతెనలు పూర్తి కాకపోవడం, ప్రత్యమ్నాయ దారులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో.. సుమారు ఐదేళ్లుగా సంగారెడ్డి, లింగంపల్లి, పటాన్‌చెరువు వెళ్లే వాహనదారులు వికారాబాద్, మంబాపూర్ మీదుగా సంగారెడ్డి వెళ్తున్నారు. తాండూరు నుంచి సంగారెడ్డి వెళ్లే మార్గంలో పెద్దేముల్, గాజీపూర్, కోటపల్లి, మొమిన్‌పేట, సదాశివపేట గ్రామాలున్నాయి. ఇదే మార్గంలో బుద్దారం వంతెన పనులు పూర్తి కాగా.. గాజీపూర్ వంతెన పనులు సుమారు ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. అదే విధంగా తాండూరు నుంచి జహీరాబాద్ రోడ్డు పనులు పూర్తి గాక, గుంతలుగా మారడంతో రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, రహదారుల మరమ్మతులు, వంతెనల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని బాధిత ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరేందుకు యత్నించగా.. వారు అందుబాటులో లేరు.

నాలుగు గంటల నిరీక్షణ



గోపన్‌పల్లి వద్ద రోడ్డుపై మరమ్మతుకు గురైన లారీ

తాండూరు రూరల్: అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గౌతపూర్ చెక్‌పోస్ట్ నుంచి గోపన్‌పల్లి వరకు రోడ్డు మరమ్మతుల కోసం సదరు కాంట్రాక్టర్ కంకరవేసి వదిలేశాడు. దీంతో ప్రస్తుత వర్షాలకు రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఆదివారం కర్ణాటక శివారులోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడ్‌తో ఓ లారీ తాండూరుకు వస్తోంది. మార్గమధ్యలో గోపన్‌పల్లి శివారులోని కార్తికేయ ట్రాన్స్‌పోర్ట్ వద్ద గుంతల్లో లారీ దిగబడి మరమ్మతుకు గురైంది. నడిరోడ్డుపై లారీ ఆగిపోవడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు, ప్రయాణికులు రోడ్డుపైనే నిరీక్షించారు. ఎట్టకేలకు లారీ మరమ్మతు పూర్తి కావడంతో రాకపోకలు సాగాయి. ఇప్పటికైనా గౌతపూర్ నుంచి గోపన్‌పల్లి వరకు రోడ్డు మరమ్మతు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



బాధితుడు సంజీవను పరామర్శించిన నాయకులు

చేవెళ్ల: బోనాల పండుగలో దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, మానవ హక్కుల వేదిక హైదరాబాద్ కార్యదర్శి రోహిత్, జాతీయ అట్రాసిటి నిరోధక ఫోర్స్ రాష్ట్ర కార్యదర్శి శంకర్, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, దళిత రత్న అవార్డు గ్రహీత చౌక్కంపేట అంజనేయులు అన్నారు. ఆదివారం బాధిత దళితుడు సంజీవను పరామర్శించారు. ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సర్పంచ్, అతని అనుచరులు దళితుడిపై దాడి చేయడమే కాకుండా కులంపేరుతో దూషించారని, ఇలా చేయడం సరైంది కాదని హితవు పలికారు. కారకుడైన సర్పంచ్ శివారెడ్డితో పాటు దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. శివారెడ్డిని సర్పంచ్ పదవి నుంచి తొలగించాలని కోరారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో దళిత యువరత్న మన్నెగూడెం వేణుగోపాల్, మాల సంక్షేమ సంఘం నాయకులు నర్సింహులు, మధు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

చేవెళ్ల: మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు గుడిపల్లి రవికాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి ఆయన తన వంతుగా లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహనీయులు చేసిన సేవలు మరువలేనివని చెప్పారు. ప్రతి ఒక్కరికీ వారు ఆదర్శనీయులని చెప్పారు. అనంతరం గౌడ సంఘం నాయకులు రవికాంత్ రెడ్డిని అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో నాటి విద్యార్థులు

యాలాల: అగ్గనూరు ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న నాటి మిత్రులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రెండు దశాబ్దాల తరువాత కలుసుకున్న బాల్య మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భీమప్పను సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణచారి తదితరులు ఉన్నారు.